క్లుప్తంగా

బాణసంచా దుకాణాల తనిఖీ

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన బాణసంచా షాపులను మున్సిపాలటీ కమిషనర్ షేక్ నజీర్ ఆదివారం తనిఖీ చేశారు. ఆయన దీపావళి మందుగుండు అమ్ముతున్న షాపులకు అనుమతులు ఉన్నాయా లేదా, భద్రతా ప్రమాణలు, ప్రజలకు కల్పించిన వసతులు పరిశీలించారు. షాపుల యజమానులు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని డాక్టర్ వైఎస్సార్ సేవా సమితి ఫౌండర్ వేములపల్లి రవి ఆధ్వర్యంలో ఆదివారం గుణదల, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో వృద్ధులకు, వికలాంగులు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు వేములపల్లి రవి మాట్లాడుతూ పేదలు, వృద్ధులకు సహాయం అందించాలనే ఉద్దేశంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలవకొల్లు రాజు, ఉప్పలూరి ప్రేమ్, షేక్ సుభాని, ఆనంద్, సంతోష్ పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు

పెనమలూరు: గోసాల గ్రామంలో శనివారం రాత్రి గ్యార్మీ పండుగను భక్తులు ఘనంగా చేశారు. గ్రామంలో జెండాలు ప్రదర్శించి జెండా చెట్టు వద్ద ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి, గ్రామ సర్పంచి సంగెపు శ్రీనివాసరావు, పార్టీ గ్రామ కన్వీనర్ పోలవరపు రవి, వార్డు సభ్యుడు ఎండీ ఆసీఫ్‌బాషా, స్థానికులు హాజీఆలీ, షేక్ బాజీ, రహీం, తమీమ్, హలీమ్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

గన్నవరం రూరల్: మండలంలోని చిక్కవరం - కొత్తగూడెం గ్రామాల రోడ్డు మార్గంలో శనివారం రాత్రి అధిక వర్షం కురవడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ మార్గంలో నాలుగు స్తంభాలు విరిగిపోగా విద్యుత్ శాఖకు రూ.1.70లక్షలు నష్టం వాటిల్లినట్లు ఏఈ వెంకటరాజు తెలిపారు. దీంతో పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆదివారం విద్యుత్ శాఖ డీఈఈ రామ్మూర్తి విరిగిన స్తంభాలు పరిశీలించారు. కొత్త స్తంభాల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.

17 మంది జూదరులు అరెస్టు

పెనమలూరు: కానూరులోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న 17 మంది వ్యక్తులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. కానూరు తులసీనగర్‌లో కృష్ణలంకకు చెందిన సుంకర శ్యామ్ అనే వ్యక్తి ఇంట్లో పేకాట నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు పేకాట ఆడుతున్న ఇంటిపై దాడి చేసి 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 3.10 లక్షల సొమ్ము స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేశారు.

వెలవెలబోతున్న బాణసంచా స్టాళ్లు

రిటైల్ స్టాల్స్‌పై వర్షం ప్రభావం



కొనుగోలుదారులు లేకపోవడంతో వెలవెలబోతున్న బాణసంచా విక్రయ స్టాళ్లు

గన్నవరం: గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు బాణసంచా విక్రయాలకు అడ్డంకిగా మారాయి. బీబీ గూడెం, పురుషోత్తపట్నంలో ఉన్న మూడు హోల్‌సెల్ దుకాణాలతో పాటు స్థానిక కోనాయి చెరువు వద్ద ఏర్పాటు చేసిన రిటైల్ స్టాళ్లపై వర్షం ప్రభావం పడింది. వర్షాలు కారణంగా కొనుగోలుదారులు లేక బాణసంచా స్టాళ్ల వెలవెలబోయాయి. ఇప్పటికే ప్రభుత్వ శాఖ ల అనుమతులు, స్టాళ్ల ఏర్పాటుకు భారీగా ఖర్చు పెట్టిన లైసెన్స్‌దారులకు వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. వర్షాలకు స్టాళ్ల ప్రాంగణంలో నీరు నిలిచి బురదమయంగా మారింది. అంతేకాకుండా బాణసంచా తడవకుండా కాపాడుకునేందు కు అష్టకష్టాలు పడుతున్నారు. కనీసం పండుగ రోజైన వాతావరణం అనుకూలిస్తే బాణసంచా విక్రయాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

భారీగా పెరిగిన ఖర్చులు

ఈ ఏడాది 29 వరకు బాణసంచా విక్రయాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, గ్రామపంచాయతీ అనుమతులు నిమిత్తం లైసెన్స్ పొందిన వ్యక్తుల నుంచి నిర్వాహకులు భారీగానే వసూలు చేశారు. కేవలం ప్రభుత్వ శాఖల అనుమతులు నిమిత్తం ఒక్కొక్క స్టాల్ నుంచి రూ. 35 వేలు వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఇవి కాకుండా ఒక్కొక్క స్టాల్ ఏర్పాటుకు సెంట్రింగ్, విద్యుత్ ఛార్జీలు, స్థలం అద్దె, ఇతర ఖర్చులకు మరో రూ. 45 వేలు వరకు భరించాల్సి వస్తోంది. మొత్తం స్టాల్‌కు రూ. 80 వేలు వరకు ఖర్చు చేయాల్సి వచ్చిందని లైసెన్స్‌దారులు చెబుతున్నారు.

బ్రాహ్మణ పరిషత్ నూతన అధ్యక్షుడిగా కిషోర్



కిషోర్‌ను సత్కరిస్తున్న సంఘు సభ్యులు

గన్నవరం: బ్రాహ్మణ పరిషత్ గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడిగా కేవీఆర్ కిషోర్ ఎన్నికయ్యారు. మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం జరిగిన బ్రాహ్మణ పరిషత్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పరిషత్ గౌరవ అధ్యక్షులుగా పన్యారం విష్ణుమూర్తి, నాదిండ్ల మోహన్, ఉపాధ్యక్షుడిగా గూడూరు వెంకట హనుమంత రావును ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు కిషోర్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రాహ్మణ పరిషత్ బలోపేతానికి, బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. మిగిలిన కార్యవర్గాన్ని త్వరలో ఎన్నుకోవడం జరుగుతుందని చెప్పారు. పలువురు పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా సురేష్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా లాయర్ సుంకర వెంకట సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు కమిషనర్ షేక్ నజీర్ ఆదివారం వివరాలు తెలుపుతూ.. తాడిగడప మున్సిపాలటీకి చెందిన లీగల్ కేసులను విజయవాడ కోర్టులో లాయర్ సుంకర వెంకట సురేష్ చూస్తారన్నారు. ఈయన పదవీ కాలం మూడేళ్లు ఉంటుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో త్రయోదశి పూజలు



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు శివాలయాల్లో త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్థానిక ఐటీఐ రోడ్డులోని భ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జునస్వామి దేవస్థానం, వీరవల్లిలోని గంగా పార్వతి సమేత కొండేశ్వర స్వామి దేవస్థానం, పెరికీడులోని ముక్తికాంత సమేత ముక్తేశ్వరస్వామి దేవస్థానం, కానుమోలులోని సోమేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం ప్రదోషకాల సమయంలో నందీశ్వరస్వామికి పంచామృతాభిషేకం వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శిథిలావస్థలో ఎస్సీ కాంప్లెక్స్



పెచ్చులు ఊడి శిథిలావస్థకు చేరుతున్న ఎస్సీ కాంప్లెక్స్

ఉయ్యూరు: పట్టణంలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన ఎస్సీ కాంప్లెక్స్ భవనం శిథిలావస్థకు చేరింది. కాంప్లెక్స్ గత కొన్నేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో భవనం శ్లాబు పెచ్చులు ఊడి, సన్‌సైడ్‌లు విరిగిపడుతున్నాయి. వర్షాలకు నీరు కారడంతో కాంప్లెక్స్‌లో అద్దెకు ఉంటున్న వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదివారం కురిసిన వర్షానికి భవనంపై అంతస్తు సన్‌సైడ్ విరిగిపడింది. ఆ సమయంలో కాంప్లెక్స్ ప్రాంగణంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఉన్నతాధికారులు కాంప్లెక్స్ భద్రతపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులను దగా చేసిన చంద్రబాబు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అన్నే వేణుగోపాల కృష్ణమూర్తి



పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను సీఎం చంద్రబాబు దగా చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పామర్రు, పెడన నియోజకవర్గాల పరిశీలకుడు అన్నే వేణుగోపాల కృష్ణమూర్తి(చిట్టిబాబు) విమర్శించారు. ఆయన ఆదివారం కానూరులో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిలువునా ముంచాడన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు చెల్లించకుండా కేవలం ఒక్క డీఏను మాత్రమే ప్రకటించి హంగామా చేశారన్నారు. పీఆర్సీ కాని, ఐఆర్ కాని ఇవ్వలేదన్నారు. ఉద్యోగులకు మొత్తం రూ.31 వేల కోట్లు బకాయి ఉంటే వాటి ఊసే లేదన్నారు. ఆర్జిత సెలవుల (ఈఎల్) వాయిదాల పద్ధతిలో ప్రకటించడం ఉద్యోగులను మోసం చేయడమేనని ఆరోపించారు. ఆరోగ్య సమస్యలతో ఉన్న ఉద్యోగులు వైద్యం చేయించుకోవడానికి ఈహెచ్‌ఎస్ పని చేయడం లేదన్నారు. సీపీఎస్ అమలు చేస్తామని ఎన్నికల్లో చెప్పిన చంద్రబాబు ఇప్పుడు సుప్రీం కోర్టు పేరు చెప్పి తప్పించుకుంటున్నారని, ఎన్నికల్లో ఉద్యోగులకు ఎలా హామీ ఇచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పటికైనా నిజం గ్రహించాలని కోరారు.

ముంపునకు గురైన రోడ్లు



నున్నలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



వెంకటనరసింహాపురం కాలనీలో జలమయమైన రోడ్డు

వీఎస్‌పురం కాలనీ(గన్నవరం): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీలోని అంతర్గత రోడ్లు జలమయం అయ్యాయి. రోడ్లపైకి వర్షం నీరు చెరడంతో రాకపోకలకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో అస్తవ్యస్త డ్రెయినేజీతోనే ఈ పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా కాలనీలోని మూడవ ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లు ముంపునకు గురై చెరువులను తలపిస్తున్నాయి. డ్రెయిన్లు పూడుకుపోవడంతో పలు వీధుల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీనివల్ల దోమల ఉధృతి పెరిగి వ్యాధుల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపై వర్షం నీరు

నున్న(విజయవాడరూరల్): శనివారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి నున్న గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రెండు అడుగుల మేర వర్షం నీరు నిలిచిపోయింది. పొలాల్లో వర్షం నీరు మొత్తం రోడ్డు మీదకి రావడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. నున్న గ్రామంలో పవర్ గ్రిడ్ వద్ద, మ్యాంగో మార్కెట్ వద్ద వర్షం నీరు వాహనాల రాకపోకలకు అసౌకర్యం కల్గిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించాలని ఆర్‌అండ్‌బీ శాఖకు నున్న గ్రామ పంచాయతీ పలు దఫాలు తీర్మానం చేసినా ఫలితం లేకపోయింది.

గన్నవరం రూరల్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని రోడ్లు జలమయంగా మారాయి. రోడ్లపై గోతుల్లో వర్షం నీరు నిలిచి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. బీబీగూడెం, తెంపల్లి, కొత్తగూడెం, చిక్కవరం, సూరంపల్లి గ్రామాల్లో రోడ్లపై నీరు నిలిచి ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు.

రేపు విద్యుత్ అదాలత్

ఉయ్యూరు: పీజీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 21న విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు జరుగుతుందని ఆ శాఖ ఉయ్యూరు ఈఈ బి.సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉయ్యూరు కేసీపీ ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే అదాలత్‌కు పీజీఆర్ఎస్ చైర్మన్ విశ్రాంత న్యాయమూర్తి ఎస్.విక్టర్ ఇమ్మానుయేల్, ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. డివిజన్ పరిధిలోని వినియోగదారులు అదాలత్‌కు హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

ఇద్దరు చిన్నారులపై తల్లి దాడి

పెనమలూరు: తాడిగడపలో ఇద్దరు చిన్నారులపై ఓ మహిళ, ఆమెతో ఉంటున్న వ్యక్తి దాడి చేయడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. తాడిగడపలో జుజ్జవరపు జ్యోతిర్మయి అనే మహిళ భర్తకు దూరంగా ఉంటుంది. ప్రస్తుతం ముళ్లపూడి మహేష్ అనే వ్యక్తితో ఉంటుంది. కాగా గతంలో ఆమె తన ఇద్దరు పిల్లలు (7),(5)ను మహేష్ కలిసి చితకబాధడంతో ఇంటి పక్కన ఉన్న వారు ఆమెను తీవ్రంగా మందలించారు. కాగా జ్యోతిర్మయి మరల తన ఇద్దరు పిల్లలను శనివారం బాగా కొట్టడంతో ఇరుగుపొరుగు వారు గ్రామంలోని మహిళా సంరక్షణ కార్యదర్శి ఎండీ ఇంతియాజ్‌బేగంకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇంతియాజ్‌బేగం జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి చిన్నారులను ఆస్పత్రికి తరలించారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

గన్నవరం: ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ గన్నవరం తాలుకా యూనిట్ అధ్యక్షుడు వి. సాంబశివరావు కోరారు. స్థానిక ఎన్జీజీవోస్ భవనంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ డీఏ బకాయిలు, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, సరండర్ లీవ్స్ అమౌంట్ చెల్లింపు, హెల్త్‌కార్డు తదితర సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అసోసియేషన్ సభ్యులు డి. రాంబాబు, జి. శ్రీను, డి. శ్రీనివాసరావు, ప్రసాద్, ఉమామహేశ్వరరావు, సునీల్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు మండేపూడి శ్రామిక భవనం పునఃప్రారంభం

కంకిపాడు: స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు, శ్రామిక వర్గాల నేత మండేపూడి నాగభూషణ్‌రెడ్డి శ్రామిక భవనం సోమవారం ఉదయం 9 గంటలకు పునఃప్రారంభం చేయనున్నట్లు సీపీఎం మండల కమిటీ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నేత వై.కేశవ రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు పాల్గొంటారని తెలిపింది.